క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



ఎల్కతుర్తి: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను హన్మకొండ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, ఉపాధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, తంగళ్ళపల్లి రఘు, కసరబోయిన రవితేజ, రాజు, మర్రి విజయ్ పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో కబడ్డీ పోటీలు

భీమదేవరపల్లి: ఫిబ్రవరి 4, 5 తేదీల్లో హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాలతో పాటు హన్మకొండ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పచ్చునూరి కరుణాకర్ తెలిపారు. మొదటి బహుమతి రూ.3016, రెండో బహుమతి రూ.2016, మూడో బహుమతి రూ.1000 నగదుతో పాటుగా షీల్డ్ అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440717466 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

పరకాల: అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజకీయ నాయకులకు, వ్యాపారస్తులకు మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా మున్సిపాలిటీ నుంచి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే తొలగించడంతో పాటు సంబంధిత వారికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అనుమతి తీసుకున్న ఫ్లెక్సీలను గడువులోగా తొలగించని పక్షంలో సిబ్బందినే తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

భూమిపూజ



గీసుకొండ: గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారం రైల్వేగేటు కూడలి వద్ద కుమ్మరి సంఘం జిల్లా, శాలివాహన ధర్మారం కమిటీల ఆధ్వర్యంలో శ్రీశ్రీ ఆతుకూరి మెల్లమాంబ (కుమ్మరి) విగ్రహ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేశారు. స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్, మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమారస్వామి, పెద్దరాజు, గౌరయ్య, రాజయ్య, చిన్నరాజు, శ్రీనివాస్, చంద్రశేఖర్, ధర్మేందర్, సురేశ్, కుమార్, శ్రీను, గణపతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎల్కతుర్తి : వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీల ప్రకారం వీఆర్ఏలందరికీ పే స్కేల్, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, 55 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మళ్లీ నిరాహార దీక్షలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నర్సింహులు, గుడెల్లి కుమార్, బొంకూరి రవిందర్, ఉపేందర్, స్వాతి, వీరస్వామి, ఎలిమి కుమారస్వామి పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ



కమలాపూర్: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 సంవత్సర డైరీని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శీలం ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎంఈఓ ఎర్రరాంకిషన్‌రాజు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ద యాకర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శోభ, కార్యదర్శి సదానందం, మండల అసోసియేట్ అధ్యక్షుడు రమేష్, ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూ సాధన కమిటీ ఏర్పాటు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం కట్టమల్లన్న ఆలయ సమీపంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్(ఆర్‌పీఐ-ఏ) ఆధ్వర్యంలో 95 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న వారు బుధవారం భూసాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య, జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షులు ఎండి సాధిక్‌ల సమక్షంలో భూసాధన కమిటీ అధ్యక్షులుగా సూదమల్ల అశోక్, ఉపాధ్యక్షులుగా శివరాత్రి సంధ్య, గుండెబోయిన అనూష, ఎండి అల్లాఉద్దీన్, జెల్లా నాగరాజు ఎన్నికైనట్లు ప్రకటించారు.

సమస్యలు దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తా

- పార్టీ కార్యక్రమాలపై అలసత్వం వద్దు
- రూ.7.5 కోట్ల సీసీ రోడ్ల పనులు ఫిబ్రవరిలో పూర్తి చేయాలి
- బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: గ్రామాల్లో ఉత్పన్నమవుతున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఈ నెపంతో పార్టీ కార్యక్రమాలపై అలసత్వం ప్రదర్శించొద్దని బీఆర్ఎస్ శ్రేణులకు వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నివాసంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 100 ఓట్లకు ఇన్‌చార్జ్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనులు, స్థానిక నాయకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐనవోలు, కక్కిరాలపల్లి, ఒంటిమామిడిపల్లి, కొండపర్తి గ్రామాల్లో 100 ఓట్లకు ఇన్‌చార్జ్ కార్యక్రమం నత్తనడకన సాగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లకు రూ.7.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఫిబ్రవరి మొదటి వారంలో పనులు ప్రారంభించి నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మండల పార్టీ నాయకులు బుర్ర రాజశేఖర్, మిద్దెపాక రవీందర్, రైతు బంధు మండల అధ్యక్షుడు జైపాల్, జెడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, చందర్‌రావు, సంపత్, కుమారస్వామి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

దామెర: మన ఊరు-మన బడి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి మాధవీలత అన్నారు. మండలంలోని కోగిల్వాయి, పులుకుర్తి, ల్యాదెల్ల, దామెర, ఊరుగొండ, తక్కళ్లపహడ్ గ్రామాల్లో చేపడుతున్న మన ఊరు-మన బడి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దామెర, ల్యాదెల్ల, తక్కళ్లపాడ్‌లో ఇప్పటికే పనులు ప్రారంభించగా పురోగతిలో ఉన్నాయని అన్నారు. కోగిల్వాయి, ఊరుగొండ గ్రామాల్లో పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీపీ కాగితాల శంకర్, తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ ఎండీ. జాకీర్ అలీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు. సర్పంచ్‌లు ఉన్నారు.

ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు



కృత్రిమ కాలు అమర్చుకున్న కొమురయ్య

కమలాపూర్: గత 8 ఏళ్లుగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో విద్య,వైద్యం, ఉపాధి వంటి సేవాకార్యక్రమాలు చేపడుతున్నామని ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్ తెలిపారు. మండలంలోని భీంపల్లికి చెందిన కుక్కల కొమురయ్యకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవాన్ మహవీర్ ట్రస్ట్ (హైదరాబాద్) సహకారంతో బుధవారం కృత్రిమ కాలు అందజేశారు. కొమురయ్య ఓ ప్రమాదంలో తన ఎడమ కాలు కోల్పోగా ఫౌండేషన్ మార్గ దర్శకులు పరికిపండ్ల నరహరి (ఐఏఎస్) చొరవతో ఆయనకు కృత్రిమ కాలు అందజేసినట్లు గుణసాగర్ నేత తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని, పేదింటి విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ, పేదింటి వయోవృద్ధులకు వీల్ చైర్లు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరబోయిన శ్రీనివాస్ యాదవ్, జీడి రాజు, పేరబోయిన నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరితే రైతు పరువు తీస్తారా?

ఐనవోలు: బీజేపీలో చేరినంత మాత్రాన డీసీసీ బ్యాంకు అధికారులతో రైతుపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి పరువు తీస్తారా అంటూ బీజేపీ హన్మకొండ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్ బీఆర్ఎస్ నాయకులపై ధ్వజమెత్తారు. బుధవారం ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇటీవల మండలంలో పాదయాత్ర నిర్వహించగా మండలంలోని ఒంటిమామిడిపల్లికి చెందిన పొన్నాల శంకర్ బీజేపీలో చేరాడన్నారు. 2021లో డీసీసీ బ్యాంకులో సదరు రైతు తనకున్న భూమిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో తిరిగి కిస్తీలు చెల్లించడం లేదన్నారు. అయితే బ్యాంకు అధికారులు అప్పు తీసుకున్న వ్యక్తి పేరుతో కరపత్రాలు ముద్రించి గ్రామంలో పంచి ఫ్లెక్సీ కట్టించి పరువు తీయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. దర్గా సొసైటీ పరిధిలో రుణాలు చెల్లించని వారు ఉన్నప్పటికీ వారిపై ఇంతటి అమానుష చర్యలు చేపట్టలేదని వాపోయారు. అతనికి ఏమైనా జరిగితే బ్యాంకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం



పార్టీ కండువా కప్పి బీజేపీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న సురేందర్‌రెడ్డి

ఎల్కతుర్తి : రాబోయే రోజుల్లో హుస్నాబాద్ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు జన్నారపు సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని దండేపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు కడితాటి చిరంజీవి ఆధ్వర్యంలో బుధవారం సుమారు 200 మంది భారతీయ జనతా పార్టీలో చేరారు. సురేందర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జనగాని కిష్టయ్య, పల్లెపాటి మధుకర్, ఆడెపు కవివర్ధన్, వినోద్, సోలెంకి రాజేశ్వర్‌రావు, రమణాచారీ, రవిందర్, తిరుపతి, శంకర్, కృపాకర్, భగవాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో సీఆర్పీల పాత్ర కీలకం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ మహ్మద్ అబ్దుల్‌హై

ధర్మసాగర్: పాఠశాల విద్యాశాఖ కార్యక్రమాల్లో సీఆర్పీలు ముఖ్య పాత్ర వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని హనుమకొండ డీఈఓ మహ్మద్ అబ్దుల్‌హై సూచించారు. టీసీఆర్పీఏ పోస్టర్ క్యాలెండర్-2023 ను ఆ సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారు మొగిలిచర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు జి.నరేష్ ఆధ్వర్యంలో బుధవారం సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, రాధ, ఏంఈఓ రామకిషన్ రాజుతో కలిసి డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సీ విజయకుమార్, డీఎల్ఎమ్‌టీ శ్రీకాంత్, సీఆర్పీలు సిహెచ్.రాజ్‌కుమార్, వెంకటేష్, కె.రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ రవి

భీమదేవరపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వంగ రవి అన్నారు. ముల్కనూర్ రైతువేదికలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీఓ భాస్కర్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల పాటు జరుగనున్న కంటి వెలుగు అన్ని గ్రామాల్లో నిర్వహించి అవసరం ఉన్న వారికి కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, ముల్కనూర్ సర్పంచ్ మాడ్గుల కొంరయ్య, పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ ఉన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై వివాదం

- మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతల ఆందోళన
- అధికారులు, ఉద్యోగులను లోపలికి వెళ్లకుండా ఆఫీస్ ఎదుట బైఠాయింపు



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ నాయకులు



కమిషనర్ శేషాంజన్‌స్వామితో వాగ్వాదం చేస్తున్న బీజేపీ నాయకులు

పరకాల : పట్టణంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఎన్నికల యుద్ధం ముందే మొదలైనట్లు కనిపిస్తోంది. ఇప్పటికే రెండు పార్టీల ముఖ్య నాయకులు వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంతో పాటు వారి హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై చర్చలకు సవాల్ విసురుకుంటున్నారు. ఇదే సమయంలో మున్సిపల్ అధికారులు ఒకే పార్టీకి చెందిన ఫ్లెక్సీలు తొలగించడం మరింత వివాదానికి దారితీసింది. బీఆర్ఎస్ ఫ్లెక్సీలు తొలగించడకుండా కేవలం బీజేపీయే తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పరకాల మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ అధికారులను, ఉద్యోగులను కార్యాలయం లోపలికి వెళ్లకుండా బీజేపీ నాయకులు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద కూర్చున్నారు. అంతటి ఊరుకోకుండా కార్యాలయం ముందే ముఖాలు కడిగి, స్నానాలు చేసి నిరసన తెలిపారు. బీఆర్ఎస్‌కు తొత్తుగా కమిషనర్ వ్యవహరిస్తున్నారంటూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు కమిషనర్ శేషాంజన్ స్వామి చేరుకొని మధ్యాహ్నం వరకు రోడ్లపై అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలన్నింటినీ మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు ఆందోళన విరమించారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పరకాలలో బీజేపీ జెండా ఎగురవేయటం ఖాయమన్న భయంతోనే స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆదేశాలతోనే రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన బీజేపీ జెండాలు మున్సిపల్ అధికారులు తొలగించారని మండిపడ్డారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తాను ఖచ్చితంగా ధర్మారెడ్డిని ఓడించి తీరుతానని శపథం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, బీజేపీ కౌన్సిలర్లు ఆర్‌పీ జయంత్ లాల్, భద్రయ్య, పూర్ణచారి, రాష్ట్రనాయకులు గురుప్రసాద్, మేఘనాథ్, నాయకులు విజయ్‌కుమార్, పురుషోత్తం, వెంకటస్వామి, పాల్గొన్నారు.

'చల్లా'తోనే అభివృద్ధి

ఆత్మకూరు : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని హౌజ్‌బుజుర్గు సర్పంచ్ రబియాబి హుస్సేన్ అన్నారు. మండలంలోని హౌజ్‌బుజుర్గులో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయాలను శాసించేది ఓటు ఒక్కటే

రాజకీయాలను శాసించే శక్తి ఒక ఓటుకే ఉంటుందని పలువురు వక్తలు కొనియాడారు. ఆయా మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో బుధవారం ఓటరు దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య భారదేశంలో ఓటు హక్కు పవిత్రమైందని పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్లలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శతాధిక వృద్ధురాలు నర్సమ్మను అధికారులు శాలువాతో సన్మానించారు.
కార్యక్రమాల్లో కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు: వృద్ధురాలిని సన్మానిస్తున్న అధికారులు



ధర్మసాగర్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



పరకాలలో..



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



భీమదేవరపల్లి : ఎన్‌వీడీ ఆకారంలో విద్యార్థినులు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు ఆయా పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకోనున్నారు. బుధవారం ఆయా కార్యాలయాల సిబ్బంది వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8:30 నుంచి 9:30 వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

హాస్టల్‌కు వెళ్లమని మందలించినందుకు..

ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిన బాలిక

- తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు
- గంటలోనే ఛేదించిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పరకాల : హాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించినందుకు ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయిన బాలికను ఫిర్యాదు అందిన గంటలలోనే గుర్తించి తిరిగి తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నడికూడ మండలం చౌటుపర్తికి చెందిన గూడెం వంశీకృష్ణ కూతురు సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి హాస్టల్‌కు వెళ్లడం లేదు. దీంతో తల్లిదండ్రులు హాస్టల్‌కు వెళ్లమని మందలించగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిపోయింది. గ్రామంలో ఎక్కడా కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలిక హన్మకొండకు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆ బస్సును వెంటాడి గూడెప్పాడ్ స్టేజీ వద్ద ఆపారు. బస్సులో ఉన్న బాలికను పోలీసులు తమ అదుపులోకి తీసుకొని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కూతురు దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

సాంస్కృతిక క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

భీమదేవరపల్లి: పాఠశాలలో చదువుతో పాటు సాంస్కృతిక క్రీడల్లో నైపుణ్యం సాధించాలని ఎఫ్ఎస్ఎల్ నోడల్ ఆఫీసర్ సునీతరాణి అన్నారు. మండలంలోని ముస్తఫాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పుర్కరించుకొని ఈ పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం కోలు రాజేందర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సునీతారాణి మాట్లాడుతూ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంటాల ప్రభాకర్, ఎంపీటీసీ మాడ్గుల ఎల్లా, ఉపసర్పంచ్ రజనాచారీ, విద్యాకమిటీ చైర్మన్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ప్రవీణ్ మృతదేహం

నడికూడ : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుంది. స్థానికుల కథనం ప్రకారం..నర్సక్కపల్లికి చెందిన బండి రవి చిన్న కు మారుడు ప్రవీణ్(25) బుధవారం తమ వ్యవసాయ బావి వద్ద పనులు చేస్తుండగా బావిలో ఎంత నీరు ఉందో చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ మోటారుకు కట్టిన జే వైరు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి సీఐ కిషన్ చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.